# చేతిలో వెన్న

చదువుకొనే రోజుల్లో —

'నేను' అనే శీర్షికతో తెలుగులో కాంపోజిషన్ రాయమన్నప్పుడు రామారావ్ అద్భుతంగా రాశాడు.

....'నేను పవిత్ర భారత దేశంలో బాధ్యత నెరిగిన పౌరుడను. నా విధుల్ని నేను క్రమము తప్పక నిర్వర్తించెదను. విధినిర్వహణ మును గుర్తించిన వారికి హక్కులను పొందుటకు తప్పక అవకాశము కలుగును.

....భవిష్యత్తులో నేనొక జిల్లా అధికారిని కావలెననునది నా ఆశయము.

....లక్ష్యసిద్ధికి దృఢదీక్ష, సాధన తోడయినచో మనము సాధించ లేనిది ఏదియును వుండదు.'

— ఇలా నాలుగు పేజీలు రాశాడు.

ఎస్సెల్సీ పాసైన నెలరోజుల కల్లా, రోజుల్ని చదువుకోవల్సి వచ్చింది రామారావ్‌కి.

తండ్రి పోయాడు.

మేనమామ శంకరయ్య — సంసారం వీధినపడకుండా కాపాడేడు. దానికిగాను ఆయన కోరిన ప్రతిఫలం - తన కూతురు సామ్రాజ్యాన్ని

రామారావ్ పెళ్ళి చేసుకోవడం.

సుందరమ్మ కొడుకుని 'అలాగే' అనమంది. తల్లినీ, తల్లి వెనగ్గా నిలబడిన ముగ్గురు చెల్లెళ్ళనీ, ఓ తమ్ముణ్ణీ చూశాడు రామారావ్. వాళ్ల కళ్ళల్లో పవిత్ర భారత దేశమంతా కనిపించింది.

శంకరయ్యతో 'అలాగే—మామయ్యా' అనేశాడు రామారావ్.

ఆ వెంటనే సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగుకి వెళ్ళిపోయాడు.

ఏడాది తిరిగేసరికీ సామ్రాజ్యం రామారావ్‌ల పెళ్లి జరిగింది. మరో కొన్నాళ్లకి రామారావ్ వాళ్ల వూళ్లోనే 'బళ్లో చేరేడు' !

తన సర్వీసులో మొదటి రోజున హాజరు పట్టీలో సంతకం చేస్తుండగా 'నేను' కాంపోజిషన్ గుర్తుకొచ్చింది రామారావ్‌కి.

మొదటి రెండు వాక్యాలూ చాలా కరెక్టుగా రాయ గలిగేననే గర్వం కలిగింది. చెమ్మగిల్లిన కళ్ళను కొత్త పైపంచెతో తుడుచుకుని సంతకం చేశాడు.

ఆ తర్వాత ఈ ముప్ఫైఏళ్లల్లోనూ ఎన్నడూ 'నేను' గురించి ఆలోచించలేదు - రామారావ్.

చెల్లెళ్ళ పెళ్లీ పేరంటాలు, తమ్ముడి చదువు, తల్లి పోవడం, తన పెద్ద కూతురి పెళ్లీ, పెద్ద కొడుకుని బీకాంలో చేర్పించడం, రెండో కూతుర్ని కాలేజీలో వెయ్యడం, మూడోదాని 'కామన్ ఎగ్జామ్' గురించి ఆందోళన పడటం, రెండో కొడుకు 'సెకండ్ హాండ్ పుస్తకాలు' చదవనని ప్రతిజ్ఞ చేయడం, మూడో వాడి 'పోలియో' ; —

ఇలా,

ప్రతి ఏడాదీ —

క్లాస్ పరీక్షలూ, క్వార్టర్లీ, హాఫ్ఇయర్లీ, యాన్యువల్ పరీక్షలూ — తన విద్యార్థులతోపాటు తనూ ఎదుర్కొంటూ వుండటం

రామారావ్‌కి అలవాటై పోయింది.

బాధ్యత నెరిగిన పౌరుడికి (!) సహనం చెప్పుల జత అరిగి పోలేదు.

రామారావ్ ఇలాంటి పరిస్థితులకి 'ఇమ్యూన్' అయిపోయాడనే అభిప్రాయాన్ని ఏకగ్రీవంగా అంగీకరించారు – సాటి ఉపాధ్యాయులూ, ఆ వూరి పెద్దలూ. దీనికి ప్రముఖమైన కారణాలు రెండున్నై.

ఐదేళ్ళక్రితం —

వో రోజు సాయంత్రం —

అప్పుడే స్కూల్ 'హోమ్-బెల్' కొట్టేరు. పిల్లలంతా బిల బిలమంటూ వెళ్ళిపోయారు. కాంపోజిషన్ పుస్తకాలు విద్యార్థుల నెంబర్ల వారీగా సర్దుతూ వున్నాడు రామారావ్ – వాటిని ఇంటికి తీసుకు వెళ్ళే ప్రయత్నంలో. క్లాస్‌రూమ్‌లో రామారావ్ తప్ప అంతా వెళ్ళిపోయారు. రెప్పపాటులో జరిగిపోయింది దుర్ఘటన. ఆ రూమ్ కప్పు మొత్తం ఉన్నపళాన విరిగి పడిపోయింది.

తను బతికే వున్నాడంటే నమ్మలేకపోయాడు రామారావ్. నలభైఏడు రోజులు హాస్పటల్ జీవితం : ఎంతోమంది పరిచయస్థులు వచ్చిపోతూ వుండేవాళ్ళు – పరామర్శచేసి, రామారావ్ అదృష్టంపట్ల ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ వుండేవాళ్ళు. కొంతమంది సన్నిహితులు రామారావ్‌కి ఆర్థికంగా సహాయపడాలని చాలా విధాలైన పద్ధతుల్ని గురించీ ఆలోచించేరు.

అన్నీ వినేవాడు రామారావ్. చిరునవ్వు నవ్వుతూ 'కమిటీవారు హాస్పటల్ ఖర్చంతా భరిస్తున్నారు; జీతం నష్టంలేదు. మీ అభిమానానికి చాలా థాంక్స్. అలాంటిదేం అవసరంలేదు' అనేవాడు.

ఖర్చులు కమిటీవారు భరించినా – తన వూరికి నలభైమైళ్ల

దూరాన పట్నంలో చికిత్స ఎంత ఖార్చైనదో రామారావ్ గుర్తించక పోలేదు. సామ్రాజ్యం, పిల్లలూ పట్నం రాకపోకలకు ఎంత ఖర్చు అయిందో, ఆ నల్భైపేడు రోజుల్లో ఆయింట్లో ఎంత 'ఏకత్వంలో భిన్నత్వం' గోచరించిందో చెప్పాలంటే అదో కథ!

రెండో సంఘటన రెండేళ్ళ క్రితం జరిగింది.

ఇంటర్ పరీక్షలకి చాలా శ్రద్ధగా హడావిడిగా చదువుకుంటోంది రామారావ్ రెండో కూతురు-సరోజ. వారంరోజుల్లో వున్నై పరీక్షలు.

మధ్యాహ్నం పన్నెండున్నరకి —

'బాగా నీరసంగావుంది. కాళ్ళూ చేతులూ నిస్సత్తువగావున్నై' అంది సరోజ.

'చదువుతున్నావ్‌గా, క్లాస్ రావాలని. అలసటగా వుందేమోనే. కళ్ళుమూసుకు పడుకో కాస్సేపు' అంది సామ్రాజ్యం. ఓ గ్లాసు మజ్జిగ ఇచ్చింది తాగమని.

మజ్జిగ తాగి వెళ్లి పడుకున్న సరోజ మళ్లీ కళ్లు తెరవనేలేదు! సాయంత్రానికి అన్నీ జరిగిపోయినై.

నాలుగో రోజున స్కూలుకి వెళ్లాడు రామారావ్. టీచర్లంతా అయోమయంగా చూసి అనునయించ సాగేరు. అందరి ప్రశ్నలకీ, సలహాలకీ — వేదాంతిలా పేలవంగా నవ్వి సమాధానం చెప్పాడు, 'లభించిన ప్రతిదాన్నీ అందుకోవడానికి సిద్ధపడిన వాడికి – ఇవన్నీ సహజం. ఇది కావాలనీ, ఇది రావాలనీ అనుకోక పోవడం – అప్పైన ఏ ఆశాభంగానికీ తావివ్వదుగదా!'

అలాంటి రామారావ్‌కి ఈ రోజు 'నేను' గుర్తుకొచ్చింది.

కనిచీకటివేళ —

సుందరం వచ్చాడు.

సుందరం, రామారావ్ బాల్య స్నేహితులు. ఇరవైఏళ్ళక్రితం సుందరం ఆ వూరు వదిలి వెళ్ళిపోయాడు. ఈ ఇరవై ఏళ్ళలోనూ అతని గురించి రామారావ్‌కి ఏ సమాచారమూ తెలీదు.

ఇవాళ హఠాత్తుగా ఊడిపడ్డాడు. వస్తూనే గలగల మాట్లాడుతూ తనగురించి చెప్పేశాడు.

ఊరువదలి వెళ్ళేముందు తనకున్న నాలుగెకరాల భూమినీ అమ్మేసి ఆ సొమ్ముతో పట్నం చేరేడు సుందరం. 'మీ నాయన ఇచ్చిపోయిన ఇరవై ఒక్క ఎకరాల ఏకచెక్కలో నువ్వు మిగుల్చుకో గలిగింది ఈ నాలుగెకరాల డబ్బే గదా. మిగిలినదంతా నీ సినిమా పాటల పిచ్చికే తగలేశావు. ఈ సొమ్మని నాకిచ్చి నే చెప్పినట్లు విను. నిన్నో మనిషిని చేస్తా' నన్నాడు సుందరం బాబాయ్. అప్పటి దాకా తాడూ బొంగరం లేకుండా — తన కంఠ మాధుర్యం తనకు లక్షలు గడించి పెడుతుందనీ, నేపథ్య గాయకుడిగా సినిమాలోకంలో వొక వెలుగు వెలగగలననీ కలలుగన్న సుందరం — కాస్త నింపాదిగా ఆలోచించాడు. బాబాయ్ సలహా పాటించి నేలమీద నిలబడటం అవసరమేనని భావించాడు. ఈ నిర్ణయం సుందరం జీవితలో ఓ మలుపు. హైదరాబాద్‌లో మోటార్ స్పేర్ పార్ట్స్ దుకాణంలో భాగస్వామిగా మారేడు సుందరం.

ఇరవై ఏళ్ళ తర్వాత — ఇవ్వాళ — సుందరంకి ఒక బార్, ఒక హోటల్, రెండు కార్లు; ఒక ఆటోమొబైల్ షాపు; ఒక థియేటర్‌లో భాగస్వామ్యం వున్నై.

ఇదంతా చెప్పి నులక మంచంలో వెనక్కి వాలి — 'కాగా ఇవ్వాళ, మద్రాసు పోతుంటే — కారు మన వూరి అడ్డరోడ్డు దగ్గర ట్రబులిచ్చింది. సరే చాలా కాలమైంది గదా మాష్టార్ని చూసి పోతే

పోతుంది అని ఇలా కొట్టుకొచ్చాను శరీరాన్ని. అబ్బాయ్ అదీ విషయం. ఏతా వాతా, మనం చాలా గొప్పవాళ్ళమై పోయాం యిప్పుడు. నాకా ఊహూళ్లో మరెవరూ అయినవాళ్లు లేరు. కనుక, మరి ఏమేం అతిథి సత్కారాలు చేస్తావో నీయిష్టం' అంటూ నవ్వేడు సుందరం.

రామారావ్ కూడా సన్నగా నవ్వేడు.

లో వాకిట్లో నిలబడి ఈ కథంతా విన్న సామ్రాజ్యం, సుందరం అన్న చివరిమాటకి ఈ లోకంలోకొచ్చి, తన బాధ్యత చప్పున అర్థమై వంటింట్లోకి నడిచింది.

రామారావ్ తన స్థితిగతుల్ని గురించి టూకీగా చెప్పేడు.

రామారావ్‌కి సంభవించిన కష్టనష్టాలకి సుందరం నొచ్చుకున్నాడు. అతని ప్రస్తుత పరిస్థితులకి ఎంతగానో వగచేడు.

'చిన్నప్పుడు ఎప్పుడూ అంటూవుండేవాడివి — నేను జిల్లా అధికారినవుతానని. అన్నట్టు ఓసారి కాంపోజిషన్‌లో కూడా రాసినట్టున్నావ్ కదూ ?'

బాల్యస్మృతుల్ని గుర్తు చేసుకుంటూ అడిగేడు సుందరం.

సరిగ్గా ఇప్పుడు,

మళ్లీ ఇన్నాళ్ళకి,

మళ్లీ ఇన్నేళ్లకి,

రామారావ్‌కి 'నేను' గుర్తుకొచ్చింది. సుందరం ప్రశ్నకి సమాధానంగా సన్నగానవ్వేశాడు. యిద్దరూ ఏవో ఆలోచనల్లో మునిగి పోయేరు.

వేపచెట్టుగాలి చల్లగా వీస్తోంది. దూరంగా వివరంలేని సవ్వళ్లు వినిపిస్తున్నాయి. ఎక్కడో పశువులకు పెట్టిన కుమ్మపొగ, అలలుఅలలుగా తేలి వలయాలుసృష్టిస్తూ ఆకాశంకేసి సాగిపోతోంది.

చుక్కలు మొలిచినై ఆకాశం మీద.

'ఎంత హాయిగా వుందిరా రామారావ్ ఈ మంచంమీద యిలా పడుకుని గాలి భోంజేస్తుంటే. మీకే సంపదలూ లేకపోయినా, ఈ అదృష్టానికి మాత్రం మా పట్నవాసం జనం ఈర్ష్య పడాల్సిందే. ఏమంటావ్ ?' అన్నాడు సుందరం. 'మేం యిప్పుడు భోంచేస్తున్నది అదే గదా' అంటూ నవ్వేడు రామారావ్.

ఇంతలో పిల్లలంతా గూటికి చేరేరు. అందర్నీ పరిచయం చేశాడు రామారావ్. రామారావ్ తన రెండో కొడుకుని సుందరంకి పరిచయంచేస్తూ 'వీడు ప్రభు. ఈ ఏడాది ఏడులోకి వచ్చాడు. కొత్త పుస్తకాలు తప్ప ముట్టుకోడు. అతి సుకుమారం, కటిక దరిద్రం - పద్ధతి' అంటూ చెప్పేడు.

ప్రభు సుందరాన్ని పరీక్షగా చూశాడు. సుందరం పెట్టుకున్న బంగారపు రిమ్‌లెస్ కళ్లజోడు వాడికెంతో బాగుందనిపించింది. ఠక్కున దాన్ని తీసుకుని తన కళ్లకు పెట్టుకుని సుందరం కేసి చూస్తూ "హౌ ఈజ్ దిస్ ఫర్ మీ?" అన్నాడు. ఈ హఠాత్ చర్యకి సుందరం రామారావ్ యిద్దరూ గతుక్కుమన్నారు.

సుందరం క్షణంలో ఆశ్చర్యం నుంచీ తేరుకుని, 'ఫైన్' అన్నాడు.

రామారావ్ మాత్రం కొడుకు చర్యని నిరసిస్తూ 'తప్పురా వెధవా.... ఇచ్చేయ్ దాన్ని' అని మందలించేడు.

కళ్లజోడు సుందరంకి యిచ్చేసి వెళ్లిపోయాడు ప్రభు. 'ఇదీ వరస. నదురూ బెదురూ లేదు వెధవకి. వట్టి పోకిరి ఘటం, మొండి తత్వం'. కొడుకు చేసిన పనికి తాను నొచ్చుకున్నాడు రామారావ్.

'ఇంగ్లీష్ బాగా మాట్లాడతాడల్లే వుందే' అన్నాడు సుందరం, యాథాలాపంగా.

'ఆ.... చదువులో ఫస్ట్. అందుకే ఆ తలబిరుసుతనం' రామారావ్ చెప్పేడు.

ఆ తర్వాత సంభాషణ ఊళ్లో తమ చిన్ననాటి మనుషులమీదికీ, పరిస్థితులమీదికీ మళ్లింది.

సామ్రాజ్యం - సుందరం భోజనం ఏర్పాట్ల కోసం సతమత మౌతోంది. ఒక పిల్లని పక్కింటి నుంచీ నెయ్యి తేవడానికి పంపింది; మరో పిల్లని పెరుగుకోసం పంపింది; ఓసారి రామారావ్‌ని ఇంట్లోకి పిలిపించి 'కొబ్బరికాయ తెప్పిస్తాను డబ్బులుంటే యివ్వమంది. రామారావ్ చిల్లర పోగుచేసి యిచ్చాడు. ప్రభుని కొబ్బరికాయ కోసం పంపింది. వాడు అంగడికి పోయి క్షణంలో పరుగెత్తు కొచ్చాడు — చేతిలో కొబ్బరికాయతో.

రామారావ్‌తో మాట్లాడుతున్న సుందరం ఇదంతా గమనిస్తూనే వున్నాడు. మాటల మధ్యలో ఓసారి అన్నాడు కూడా, లోపల సామ్రాజ్యానికి వినిపించేటట్లు — 'నా కోసం ప్రత్యేకంగా ఏం చెయ్యక్కర లేదమ్మా' అని.

సామ్రాజ్యం బయటికొచ్చి "మీకోసం ఏం చేయటం లేదండీ. చేసినా పేరుమీదీ నోరు మా పిల్లల్దీ అవుతుంది' అన్నది. సుందరం నవ్వేడు.

కొబ్బరి కలిపిన వంకాయ కూరా, సాంబారూ, కొబ్బరిపచ్చడీ, గడ్డపెరుగూ — వడ్డనతో భోజనాలైనాయి. రామారావ్‌కీ సుందరంకీ మాత్రం వడ్డించింది సామ్రాజ్యం. భోజనం చేస్తుండగా పిల్లలు ఎవరూ ఆ ఛాయలకి రాకుండా కట్టుదిట్టం చేసిందికూడా.

తాము భోంచేస్తుండగా, గదప చాయిన నిలబడి తొంగి తొంగి చూస్తున్న ప్రభుని సుందరం చాలాసారులు గమనించాడు. వాడి చూపులూ తన చూపులూ కలిసినప్పుడు ఎందుకో 'గిల్టీ' గా ఫీలయ్యాడు సుందరం.

ఆరుబయిట పక్కలు వేశారు పిల్లలు.

మంచం మీద కూర్చుంటూ అన్నాడు సుందరం — 'యిహ మా డ్రైవరు ఎప్పుడొచ్చినా విచారం లేదు. ప్రయాణం మాత్రం తెల్లవారిన తర్వాతే. ఈ భుకాయాసంతో కార్లో పడుకోవాలన్నా నావల్లకాదు. బండి బాగా ఓవర్ లోడ్ అయ్యింది.'

పిల్లలంతా చప్పట్లు కొట్టూ నవ్వేరు, సుందరం మాటలకి.

ఆతర్వాత కొంతసేపటికి అంతా నిద్రకి వుపక్రమించేరు.

ఒక రాత్రివేళ —

చప్పున మెలకువ వచ్చింది సుందరంకి. పక్క మంచంకేసి చూస్తే రామారావ్ లేడు.

* * *

నాలుగు రోజుల తర్వాత —

సుందరం నుంచీ ఉత్తరం వచ్చింది రామారావ్‌కి.

'ప్రభుని నాదగ్గర వుంచుకుని చదివిస్తాను. మీకు అభ్యంతరం లేకపోతే పంపించు, — ఇదీ సారాంశం.

రామారావ్ ఆశ్చర్యపోయాడు.

సామ్రాజ్యంతో చెప్పేడు. ప్రభునీ అడిగేడు. వాడు ఎగిరి గంతేసి 'ఓ. యస్.' అన్నాడు.

సామ్రాజ్యం మాత్రం సుందరం ఆంతర్యం ఏమిటో, అతనీ నిర్ణయం తీసుకోవటానికి కారణమేమిటో అంటూ సందేహాలు

వెలిబుచ్చింది.

రామారావ్ మాత్రం తనకుతానుగా ఏ అభిప్రాయాన్ని తెలియ జేయలేదు సామ్రాజ్యంకి.

మర్నాడు,

సామ్రాజ్యం అన్నది, 'వాడు వెళ్తానంటున్నాడు. వాడి భవిష్యత్తైనా బాగు పడుతుందేమో. పంపుదాం. చివరికి మీ సుందరం గారు దత్తతే అన్నా సరేనందాం. ఏమంటారు?'

రామారావ్ ఏమీ అనలేదు.

సుందరం తమయింట్లో వున్న రాత్రి జరిగిన సంఘటన గుర్తు కొచ్చింది. దాంతో పాటు ప్రభు చేతిలో వెన్నముద్దా కళ్ళముందు మెదిలింది.

'ఈ అవకాశం చేతిలో వెన్నముద్ద లాంటిది' కాబోలు అనిపించింది రామారావ్‌కి. అయితే,

తన ఆశయమూ చేతిలో వెన్నముద్ద లాంటిదేనేమో!! రామారావ్‌కి 'నేను' గుర్తుకొచ్చింది!

* * *

ఆ రాత్రి ప్రభు తనకు ఎంతో యిష్టమైన వెన్న తినటానికి వంటింట్లోకి వెళ్లటం, తీరా అతను తల్లి దాచిన వెన్నముద్దను చేత పట్టుకునేసరికీ ఆమె రావటం, తల్లీ కొడుకుల ఘర్షణ, రామారావ్ కూడా రావడం, ప్రభు మాటలూ — అన్నీ సుందరం చూశాడనీ,

'ఆ వచ్చినాయనకేమో చేసినవన్నీ వడ్డించేసి మాకేమో వేలితో విదిలించేశావ్. వెన్నంటే నాకు ప్రాణం. ఇందాక ఎంతసేపు అడిగినా పెట్టలేదుగా. అందుకే ఇప్పుడు తీసుకుంటున్నా. కనీసం ఇట్లాంటి

చిన్న కోరికలు కూడా తీర్చలేరు, కొత్త పుస్తకాలు కొనమంటే ఏడుస్తారు గానీ బాగా చదువుకొని నువ్వన్నా జిల్లాకి అధికారివి కావాలిరా ప్రభూ – అంటూ చాలా కబుర్లు చెప్తారు. తిండి లేకుండా, పుస్తకాలు లేకుండా ఏమిటి చదివేది - నా బొంద ...."

అన్న ప్రభు మాటలూ సుందరం విన్నాడనీ – రామారావ్‌కిగానీ, సామ్రాజ్యంకి గానీ, ప్రభుకు గానీ తెలీవు ! ! !